సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ‌। 7 ‌। నవంబర్ ‌। 2023



ఆ ఊరికి ఇద్దరు ప్రజాప్రతినిధులు

ఒకే ఊళ్లో ఇద్దరు చొప్పున ప్రజాప్రతినిధులు ఉన్నా.. దశాబ్దాలుగా కనీస సౌకర్యాలు లేక అల్లాడుతోంది మొట్లగూడెం. IIలో



వామపక్షాలను గెలిపించండి

ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం నేత జి.వెంకట్ కోరారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 23°

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వాతావారణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

11 నామినేషన్లు దాఖలు



భద్రాచలంలో నామినేషన్ వేస్తున్న వెంకట్రావ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 11 నామినేషన్లు దాఖలయ్యాయి. పినపాక నియోజకవర్గం నుంచి రెండు, ఇల్లెందు నుంచి రెండు, కొత్తగూడెంలో ఒకటి, అశ్వారావుపేటలో నాలుగు, భద్రాచలంలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. పినపాక నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా వాసం మంగయ్య, పాల్వంచ దుర్గ, ఇల్లెందులో కాంగ్రెస్ ఆశావహ అభ్యర్థి చీమల వెంకటేశ్వర్లు, స్వతంత్ర అభ్యర్థి మోకాళ్ల కృష్ణ, కొత్తగూడెంలో యువతరం పార్టీ అభ్యర్థి పాట్రు ప్రవీణ్‌కుమార్, అశ్వారావుపేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, కల్లూరి కృష్ణ, అంగోతు కృష్ణ, కుంజా నాగమణి, కంగాల కల్లయ్య నామినేషన్లు వేశారు. భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావ్, తెల్లం సీతమ్మ, స్వతంత్ర అభ్యర్థి పండ్ర హేమసుందర్ నామినేషన్లు వేశారు. ఇందులో అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలంలో పండ్ర హేమసుందర్ రెండోసారి నామినేషన్లు వేయడంతో ఆ రెండింటినీ పరిగణనలోకి తీసుకోలేదు.

700 కి.మీ. పాదయాత్ర పూర్తి

టేకులపల్లి నుంచి శబరిమల వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

టేకులపల్లి: టేకులపల్లికి చెందిన గురుస్వామి అంబాల బాలయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులు గద్దం నవీన్, వడ్నాల శ్రీనివాస్, భూక్యా నాగు గతనెల 19న పాదయాత్రగా శబరిమల బయలుదేరారు. కొత్తగూడెం, తిరువూరు, మైలవరం, విజయవాడ, గుంటూరు, చిలకలూరిపేట, నెల్లూరు, రెడ్‌హిల్స్, తిరుచ్చి, దిండుగల్, కుమిలి, ఎరుమేలి మీదుగా 41 రోజుల పాటు నడిచి పంబా సన్నిధానానికి చేరకుంటామని, సోమవారం నాటికి 700 కిలోమీటర్లు నడిచి తమిళనాడు రాష్ట్రంలోని తాంబరం రోడ్ దాటామని స్వాములు 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.

కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా జగన్మోహన్



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ రమేష్, రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి.జగన్మోహన్‌రాజును నియమితులయ్యారు. ఈఈఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అయిన ఆయనను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా, జగన్మోహన్‌రాజు 2005లో ఈఈఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులు కాగా, గతంలో వసతి గృహ సంచాలకులుగా, వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు సోమవారం వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఉత్తర్వులు అందజేశారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ పున్నంచందర్ నుంచి జగన్మోహన్‌రాజు బాధ్యతలు స్వీకరించనున్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

పాల్వంచ: పాల్వంచలోని థర్మల్ రిక్రియేషన్ క్లబ్‌లో జిల్లా స్థాయి జీయర్ స్పోర్ట్స్ ఫెస్టివల్–2023 ముగిసింది. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించగా, విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో రామ్ నచ్చికేత్, గౌతమ్, కౌశల్, షయాన్, సీనియర్స్ నుంచి నోయల్, భవ్య చరణ్, లిఖిత్, రోహన్, మహేష్, బాలికల విభాగంలో రోడా గ్రేస్, భావన, కార్తీక రెడ్డి, ముసరాత్ విజేతలుగా నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు.

రూ. 2.45 కోట్లు సీజ్.. రూ. 2.15 కోట్లు విడుదల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో 109 కేసులకు సంబంధించి రూ.2,45,76,000 సీజ్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో సరైన ఆధారాలు చూపించడంతో రూ.2,15,62,460 తిరిగి విడుదల చేశామని పేర్కొన్నారు. ఆయా ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీ విచారిస్తుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చర్యలు చేపడుతున్నామని వివరించారు.

ఇటు ప్రచారం.. అటు నామినేషన్లు

ఉమ్మడి జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయం

- ఐదు స్థానాల్లో సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభలు పూర్తి
- రాహుల్, ప్రియాంక సభల కోసం కాంగ్రెస్ కసరత్తు
- అన్ని స్థానాల్లో 'హస్తం' అభ్యర్థుల ప్రకటన
- ఏడు నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమైన సీపీఎం
- కొత్తగూడెం బరిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. రోజుకో సభ, పూటకో సమావేశంతో అభ్యర్థులు ప్రచారం హోరెత్తిస్తున్నారు. మరోవైపు నామినేషన్ల దాఖలు కార్యక్రమం ఊపందుకుంది. ఇప్పటికే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు కాంగ్రెస్ తరఫున ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేయగా.. మరోమారు భారీ ర్యాలీలతో నామినేషన్‌కు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఇంకా అశ్వారావుపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు దాఖలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల సీఎం కేసీఆర్ సభలు పూర్తి కాగా.. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీతో ఉమ్మడి జిల్లాలో సభల నిర్వహణకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. కాగా, కాంగ్రెస్‌లో మిగిలిన నాలుగు స్థానాలకు సైతం అభ్యర్థులను సోమవారం ప్రకటించారు. సీపీఎం అభ్యర్థులను సైతం ప్రకటించగా ప్రచారానికి సిద్ధమవుతుండగా.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుంచి పోటీ ఖరారైంది.

■ దూషణలు.. విమర్శలు

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య దూషణల పర్వం కొనసాగుతోంది. కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. బీఆర్‌ఎస్ అభ్యర్థులు పువ్వాడ అజయ్‌కుమార్, కందాల ఉపేందర్‌రెడ్డి మధ్య విమర్శలు పదునెక్కాయి. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరైన సభల్లోనూ తుమ్మల, పొంగులేటిపై విమర్శలు సంధించారు. వీరిద్దరిని కరటక దమనకులతో పోల్చగా పువ్వాడ, కందాల సైతం వారిపై విమర్శలు పెంచారు. మరోపక్క తుమ్మల, పొంగులేటి కూడా సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ, కందాలపై ప్రతివిమర్శలకు దిగుతున్నారు. తానే కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించానని తుమ్మల.. ప్రజాస్వామ్యం పదానికి సీఎం కేసీఆర్‌కు అర్థమే తెలియదని పొంగులేటి ఆరోపించారు. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ విమర్శలు ఏ స్థాయికి వెళ్తాయో చూడాల్సిందే.

■ పై'చేయి' సాధించేందుకు..

కాంగ్రెస్ ఎలాగైనా పై'చేయి' సాధించాలనే వ్యూహంతో ముందుకు సాగుతోంది. మధిర, ఖమ్మం, పాలేరు, భద్రాచలం, పినపాక అభ్యర్థులను గతంలో ప్రకటించారు. మిగిలిన సత్తుపల్లి, వైరా, ఇల్లెందు, అశ్వారావుపేటకు సైతం అభ్యర్థులను సోమవారం రాత్రి ప్రకటించేశారు. మరోపక్క మధిర, ఖమ్మం, పాలేరు అభ్యర్థులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రచార జోరు పెంచారు. మిగతా అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేయనుండగా, రాహుల్, ప్రియాంకగాంధీతో సభలకు ప్రయత్నాలు చేస్తున్నారు.

■ రంగంలోకి సీపీఎం

నిన్నా మొన్నటి వరకు కాంగ్రెస్‌తో పొత్తు ఉంటుందని భావించిన సీపీఎం ఎటూ తేలక ఒంటరిగానే బరిలోకి దిగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 17 స్థానాలు, ఉమ్మడి జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. పాలేరు నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేస్తున్నారు. అలాగే, ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర, భద్రాచలం, అశ్వారావుపేట అభ్యర్థులు నామినేషన్ల దాఖలు, ప్రచారంపై దృష్టి సారించారు.

■ టాప్ గేర్‌లో కారు..

రెండున్నర నెలల ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్ ప్రచారంలోనూ దూసుకుపోతోంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో ఒక విడత ప్రచారం పూర్తి చేయగా.. ఇప్పుడు గ్రామాలు, డివిజన్లలో పర్యటిస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సీఎం కేసీఆర్ పాలేరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. అభ్యర్థులతోపాటు కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, వైరా ఇన్‌చార్జ్, ఎంపీ నామ నాగేశ్వరరావు, మధిర ఇన్‌చార్జ్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఇతర నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు అక్కడి పరిస్థితులను సమన్వయం చేస్తున్నారు. ఇక ఈనెల 13, 21 తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు.

■ కొత్తగూడెం బరిలో కూనంనేని

కొత్తగూడెం నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీ చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్‌తో సీపీఐకి అవగాహన కుదిరింది. ఈనెల 8న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు కూనంనేని వెల్లడించారు. దేశ భవిష్యత్, వర్తమాన రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్‌తో కలిసి ముందుకు సాగుతున్నామని.. రాజకీయ అవగాహన మేరకు సీపీఐ కార్యకర్తలు నడుచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

■ ఐదు స్థానాల్లో బీజేపీ

ఇప్పటి వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. ఇల్లెందు, భద్రాచలం, పినపాక, పాలేరు, సత్తుపల్లిలో అభ్యర్థులను వెల్లడించగా.. రాష్ట్ర స్థాయిలో జనసేనతో ఆ పార్టీకి పొత్తు ఖరారు కానుంది. దీంతో మిగిలిన స్థానాల్లో ఎక్కడెక్కడ జనసేన, బీజేపీ పోటీ చేస్తుందో తేలాల్సి ఉంది. అభ్యర్థుల ప్రకటన పూర్తయ్యాక బీజేపీ అగ్రనేత అమిత్‌షా, కేంద్ర మంత్రులు ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఎన్నికల వేళ నిరంతర నిఘా..



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్, పక్కన భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, ఇతర జిల్లాల అధికారులు

సత్తుపల్లిలో నాలుగు జిల్లాల కలెక్టర్లు, అధికారుల భేటీ

సత్తుపల్లి: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడడంతో పాటు అక్రమాలు జరగకుండా నిరంతరం నిఘా ఏర్పాట్లు చేశామని ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు, మద్యం సరఫరా జరగకుండా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సరిహద్దు జిల్లాల అధికారులు పరస్పరం సహకరించుకుంటూ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఏపీలోని ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. సరిహద్దు గ్రామాల్లో పోలింగ్‌కు రెండురోజుల ముందు విస్తృతంగా పెట్రోలింగ్ చేయాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ ఏపీలోని ఏలూరు, అలూరి సీతారామరాజు జిల్లాలే కాక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దుగా ఉన్నందున మద్యం రవాణాపై గట్టి నిఘా వేయాలని సూచించారు. అనంతరం భద్రాద్రి ఎస్పీ వినీత్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, డీసీపీ అజిత, ఏలూరు జాయింట్ కలెక్టర్ పి.లావణ్యవేణి మాట్లాడగా ఖమ్మం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, అధికారులు పాల్గొన్నారు.

హస్తం.. సంపూర్ణం!

- మిగిలిన నాలుగు స్థానాలకూ అభ్యర్థుల ప్రకటన
- ఇల్లెందుకు కనకయ్య, అశ్వారావుపేటలో ఆదినారాయణకు అవకాశం
- పొత్తులో భాగంగా సీపీఐకి కొత్తగూడెం కేటాయింపు
- వైరాకు రాందాస్, సత్తుపల్లికి రాగమయి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. గతంలో పాలేరు, ఖమ్మం, మధిర, భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా.. మిగతా స్థానాలకు ఆలస్యమవుతూ వచ్చింది. తాజాగా సోమవారం రాత్రి వైరా, సత్తుపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగే అభ్యర్థులను ప్రకటించింది. పొత్తులో భాగంగా కొత్తగూడెం స్థానానికి సీపీఐకి కేటాయించడంతో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పోటీకి దిగనున్నారు.

అభ్యర్థులు వీరే...

వైరా అభ్యర్థిగా మాలోతు రాందాస్, సత్తుపల్లి అభ్యర్థిగా డాక్టర్ మట్టా రాగమయి, ఇల్లెందు అభ్యర్థిగా కోరం కనకయ్య, అశ్వారావుపేట అభ్యర్థిగా జారె ఆదినారాయణను కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. దీంతో కొద్దిరోజులుగా ఈ స్థానాల్లో ఎవరు పోటీకి దిగుతారనే ఉత్కంఠకు తెరపడింది. సర్వే నివేదికల ఆధారంగానే పార్టీ టికెట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. వైరా నుంచి భట్టి అనుచరుడు మాలోతు రాందాసుకు టికెట్ దక్కగా, ఇల్లెందు, అశ్వారావుపేటలో పొంగులేటి అనుచరులు కోరం కనకయ్య, జారె ఆదినారాయణ బరిలోకి దిగుతున్నారు. ఉత్కంఠ పరిణామాల మధ్య సత్తుపల్లి టికెట్‌ను మట్టా రాగమయి కైవసం చేసుకున్నారు. కొత్తగూడెంలో పలువురు ఆశావహులు టికెట్ కోసం పోటీ పడినా.. పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించింది. సీపీఐతో పొత్తు కుదరగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం బరిలో దిగుతుండగా.. మిగతా తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేయనున్నారు.

ఇంటి నుంచే ఓటు..

- దివ్యాంగులు, వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం
- పోలింగ్ శాతం పెంచేందుకు ఈసీ చర్యలు
- జిల్లాలో దివ్యాంగులు 14,930, వృద్ధులు 13,082 మంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఎన్నికల సంఘం మంచి అవకాశం కల్పించింది. వారు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కొందరు అసలు ఓటేయకుండానే ఉంటున్నారు. అలాంటి వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ అవకాశం దక్కింది. ఈసీ నిబంధనల మేరకు జిల్లాలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 40 శాతం కంటే అధికంగా వైకల్యం ఉన్నవారికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నట్లు ఇటీవల ఓ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల కూడా ప్రకటించారు. దీంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. ఫారం –12 డీ పూర్తి చేసి రిటర్నింగ్ అధికారికి అందజేస్తే బీఎల్‌ఓ స్థాయి అధికారులు ఇంటికే బ్యాలెట్ పేపర్ తీసుకొచ్చి వారితో ఓటు వేయిస్తారు.

జిల్లాలో 28,012 మంది..

జిల్లాలో పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన దివ్యాంగులు 14,930 మంది, వృద్ధులు 13,082.. మొత్తం 28,012 మంది ఉన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 2,910 మంది దివ్యాంగులు, 3,202 మంది వృద్ధులు, పినపాకలో 3,768 మంది దివ్యాంగులు, 2,338 మంది వృద్ధులు, భద్రాచలంలో 2,749 మంది దివ్యాంగులు, 1,770 మంది వృద్ధులు, ఇల్లెందులో 3,456 మంది దివ్యాంగులు, 3,682 మంది వృద్ధులు, అశ్వారావుపేట నియోజకవర్గంలో 2,047 మంది దివ్యాంగులు, 2,090 మంది వయో వృద్ధులు ఉన్నారు.

ఓటేయడం ఎలా..

ఈ ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటేయాలనుకునే అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు బూత్ లెవెల్ అధికారుల వద్ద ఫాం–12డీ తీసుకుని, వివరాలు నమోదు చేసి తిరిగి వారికే అందజేయాలి. దాని ఆధారంగా ఓటేసే వారి ఇంటికి బీఎల్‌ఓతో పాటు ఇద్దరు ఎన్నికల అధికారులు, ఒక పోలీస్ అధికారి బ్యాలెట్ పేపర్, బాక్సుతో వెళ్తారు. ఇంట్లో కూడా రహస్యంగానే ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను వీడియోగ్రాఫర్ రికార్డు చేస్తారు.

ఈసీ ఆదేశాల మేరకు చర్యలు



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నాం. దీనివల్ల పోలింగ్ శాతం పెరుగుతుంది. అయితే పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపులు, వీల్‌చైర్లు కూడా ఏర్పాటుచేస్తున్నాం.

– ప్రియాంక ఆల, జిల్లా ఎన్నికల అధికారి

'గూడెం' సీపీఐ అభ్యర్థిగా కూనంనేని

సింగరేణి (కొత్తగూడెం): కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా కొత్తగూడెం అసెంబ్లీ స్థానం నుంచి సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు బరిలోకి దిగుతున్నారు.


బయోడేటా..

పేరు: కూనంనేని సాంబశివరావు

భార్య : ప్రమీలాదేవి, కుమారుడు భరత్, కూతురు క్రాంతి

విద్యార్హత: డిగ్రీ

రాజకీయ ప్రస్థానం : సీపీఐ కొత్తగూడెం టౌన్, డివిజన్ కార్యదర్శిగా, 2005 నుంచి 09 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు.



1987 నుంచి 1992 వరకు కొత్తగూడెం ఎంపీపీగా వ్యవహరించారు. 1999, 2004లో సుజాతనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2009లో కొత్తగూడెం నుంచి పోటీ చేసి గెలుపొందారు. తిరిగి 2014లో ఓటమి పాలయ్యారు. అనేక కార్మిక, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఈ క్రమంలో మూడు సార్లు అరెస్ట్ అయి జైలు జీవితం గడిపారు.

ఎవరికీ పట్టని ఏజెన్సీ !



దుమ్ముగూడెం మండలం ములకనాపల్లి వెళ్లే రోడ్డు ఇదే..

- ఎండమావులుగానే మిగిలిపోయిన అభివృద్ధి
- సాగునీటి ప్రాజెక్టులకు మోక్షమెప్పుడో ?
- 40 ఏళ్లుగా రోడ్లు, విద్యుత్ లేని పలు గ్రామాలు
- పాలకులు మారినా గిరిజనుల బతుకులు అంతంతే..

భద్రాచలం: భద్రాచలం ఏజెన్సీలో అభివృద్ధి ఎండమావిగానే మారింది. ఈ నియోజకవర్గానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యత ఉంది. అత్యధిక గిరిజనులు నివసించే ప్రాంతంతో పాటు అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఒకప్పుడు ఎనిమిది మండలాలతో పాటు పెద్ద నియోజకవర్గంగా ఉన్న భద్రాచలం.. రాష్ట్ర విభజనతో అతి చిన్నదిగా మారింది. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి ఆదివాసీల జీవితాలు మాత్రం అలాగే ఉంటున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంతం వెంట వాజేడు, వెంకటాపురం, చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలు ఉండగా, భద్రాచలం మినహా ఇతర మండలాల్లో వ్యవసాయమే జీవనాధారం. అయినా ఆశించిన మేర సాగునీటి ప్రాజెక్టులు లేవు. తాగు, సాగునీరు, రోడ్లు, విద్యుత్ ఇతర సమస్యలు షరామామూలే.

వద్దిపేట చెక్‌డ్యామ్ కలేనా..?

చర్ల మండలం పూసుగుప్ప పంచాయతీ పరిధిలోని వద్దిపేట వద్ద తాలిపేరు వాగుపై నిర్మించ తలపెట్టిన చెక్‌డ్యామ్ గురించి ప్రజాప్రతినిధులు మరిచేపోయారు. ఇక్కడ చెక్‌డ్యామ్ నిర్మిస్తే 22 గిరిజన గ్రామాల్లోని 7,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని అంచనా. 2008లో నాటి సీఎం దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో నిర్మాణానికి చర్యలు చేపట్టగా ఆయన మరణంతో నిలిచిపోయింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక చెక్‌డ్యామ్ నిర్మాణం సాధ్యం కాదని, లిఫ్ట్ ఇరిగేషన్ చేపట్టి సాగునీరు అందిస్తామని ప్రకటించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. సర్వేలు చేపట్టి హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. ఎన్నికల సమయంలోనే దీని గురించి మాట్లాడుతున్నారని, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారాస్త్రంగా 'పాలెం'..

వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో జలయజ్ఞంలో భాగంగా వెంకటాపురం మండలం మల్లపురం వద్ద రూ.74 కోట్లతో 10,125 ఎకరాలకు సాగునీరు అందించేందుకు పాలెం వాగు ప్రాజెక్టుకు రూపకల్పన చేసి ప్రారంభించారు. నాలుగు గేట్లు ఏర్పాటు చేయగా, ఆ తర్వాత పనులు నిలిపేశారు. కెనాల్ పనులు సైతం ఎక్కడివక్కడే ఆగిపోయాయి. ఇప్పుడు దీని నిర్మాణం అంచనా వ్యయం రూ.120 కోట్లుగా చెబుతున్నారు. ఈ ప్రాజెక్టును రాజకీయ పార్టీలు ప్రతి ఎన్నికల్లోనూ ప్రచార అస్త్రంగా వాడుకుంటున్నాయే తప్ప నిర్మాణం పూర్తి చేయడం లేదు.


ఉపయోగపడని సీతమ్మసాగర్..

గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ ప్రాజెక్టుతో ఏజెన్సీ మండలాల్లో ఒనగూరే ప్రయోజనమేమీ లేదు. దుమ్ముగూడెం, చర్ల మండలాల రైతులు భూములు కోల్పోవడమే తప్ప ఎకరం భూమికి కూడా సాగునీరు అందేలా ప్రణాళిక లేదు. ఇక చర్ల మండలంలో ఎప్పుడో నిర్మించిన తాలిపేరు ప్రాజెక్టుకు ఇంతవరకూ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో ప్రాజెక్టు మన్నికపై ఆధారిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా సిల్టు పేరుకుపోవడంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గుతోందని అంటున్నారు.

అపరిష్కృతంగానే రోడ్లు, విద్యుత్ సమస్యలు..

భద్రాచలం ఏజెన్సీలో పలు గిరిజన గ్రామాలు ఏర్పడి నాలుగు దశాబ్దాలు దాటుతున్నా కొన్ని చోట్ల ఇప్పటికీ రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు అందుబాటులో లేవు. ఈ గ్రామాలకు చేరుకోవాలంటే అడవులు, వాగులు దాటాల్సిందే. దుమ్ముగూడెం మండలం మానుగుట్ట, ములకనాపల్లి, పెద్ద మడుగు, సంగం, సిరిగుండం గ్రామాలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేవు. చర్ల మండలం కురకటపాడు, రామచంద్రాపురం, బక్కచింతల పాడు, మీరాపురం, రాళ్లాపురం గ్రామాలకు రహదారి లేకపోగా, కుర్నపల్లి, బోదనపల్లి, ఎర్రబోరు, పూసుగుప్ప గ్రామాలకు బోరు నీరే దిక్కు. అవీ సక్రమంగా పని చేయక తాగునీటికి కటకటే. వెంకటాపురం, వాజేడు మండలాల్లో కొన్ని గ్రామాలకు రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. కొద్దిపాటి వరదలొచ్చినా ఈ మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ రోడ్లపై హైలెవల్ వంతెనలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గండ్లవాగుగా గుండ్లవాగు..



తరచూ గండ్లు పడే గుండ్లవాగు ప్రాజెక్టు

వాజేడు మండలం కొప్పునూరు వద్ద 2,580 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన గుండ్లవాగు ప్రాజెక్టు గండ్లవాగుగా మారింది. 1975లో నిర్మించిన ఈ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో ఆధునీకరించకపోవడంతో మట్టి కట్టలకు గండ్లు పడుతూ రైతులకు కన్నీరు పెట్టిస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కనీసం 100 ఎకరాలకు కూడా సాగునీరు అందించడం లేదు. ఇదే మండలంలోని కృష్ణాపురం వద్ద మోడికుంట వాగుపై 2005లో రూ.124.60 కోట్లతో ప్రారంభించిన మోడికుంట ప్రాజెక్టు పునాదుల్లోనే నిలిచిపోయింది. ప్రతి ఏడాదికి ప్రాజెక్టు అంచనా వ్యయం పెరుగుతోందే తప్ప నిర్మాణం మాత్రం జరగడం లేదు.

క్లుప్తంగా

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఓటుహక్కు వినియోగంపై సోమవారం సింగరేణి మహిళా కళాశాల, ఎస్‌ఆర్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి శీలం శ్రీనివాసరావు, కొత్తగూడెం నియోజకవర్గ నోడల్ అధికారి, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఓటు వినియోగంపై మాట, పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని, ఎక్కడైనా అక్రమాలు వెలుగు చూస్తే సీ- విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని చైతన్య పరిచారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ పాగి వెంకన్న, కళాకారులు యంగల కుమారి, పమ్మి రవి, బొమ్మెర ముత్యం, గోవింద గురవయ్య, నకిరేకంటి వెంకటేశ్వర్లు, కొండ్రు హుస్సేన్, ఆర్‌ఐలు రాంబాబు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

13 కిలోల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద సోమవారం పోలీసులు 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద గంజాయి లభించడంతో స్టేషన్‌కు తరలించి విచారించారు. విజయవాడకు చెందిన పొడిశెట్టి యశ్వంత్, రెడ్డి అశోక్, గుండిపూడి దుర్గాప్రసాద్‌లు ఒడిశా సరిహద్దులోని సీలేరులో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి, విజయవాడలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.3.70 లక్షలు ఉంటుందని అంచనా. బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

ఉద్యోగులు పనిపై శ్రద్ధ కనబర్చాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాల ఉద్యోగులు పనిపై శ్రద్ధ కనబరుస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని రక్షణ తనిఖీ బృందం సభ్యుడు, జీఎం యూజీ మైన్స్(ఈ అండ్ ఎం) రఘురామిరెడ్డి సూచించారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)లో 54వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా బృందం సోమవారం పర్యవేక్షించింది. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి కేటాయించిన పనిస్థలాల్లో భద్రతతో పనిచేస్తే సింగరేణిని ప్రమాదరహితంగా తీర్చిదిద్దొచ్చని తెలిపారు. అనంతరం గత ఏడాది (2022-23) ఆర్‌సీహెచ్‌పీకి ప్రకటించిన ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజు, అధికారులు, సంఘాల నాయకులు కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, ఎస్‌కే.కరీముల్లా, వి.నరేంద్రకుమార్, పి.శ్రీనివాస్, కె.ఆంజనేయ ప్రసాద్, డి.వెంకటేశ్వర్లు, జి.నరేందర్, ఎండీ.రజాక్, విశ్వేశ్వరయ్య, అజ్మీరా శ్రీనివాస్, ఎస్‌కే.గౌస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

వర్షం రావడంతో స్తంభానికి విద్యుత్ ప్రసారమై ప్రమాదం

కొత్తగూడెంటౌన్: రోజులాగే ఇడ్లీ బండి నడుపుకుంటున్న మహిళ విద్యుదాఘాతానికి గురైంది. సోమవారం రాత్రి వర్షం కురవడంతో విద్యుత్ స్తంభానికి కరెంట్ ప్రసారమై ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం బర్లీఫిట్‌కు చెందిన బైరిశెట్టి నారాయణ, మంగాదేవి దంపతులు పోస్టాఫీస్ సెంటర్‌లో వన్‌టౌన్ పక్కనే ఇడ్లీ బండి పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. అనారోగ్యంతో భర్త నారాయణ కొద్దిరోజులుగా ఇంటికే పరిమితం కాగా దేవి ఇడ్లీ బండిని నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. రోజులాగే సోమవారం రాత్రి కూడా ఇడ్లీలు విక్రయిస్తోంది. అకస్మాత్తుగా వర్షం రావడంతో సామగ్రి సర్దుకుంటున్న క్రమంలో కరెంట్ స్తంభానికి తగలగా, విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పి పడిపోయింది. వర్షం రావడంతో స్తంభానికి విద్యుత్ ప్రసారమై ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న బంధువులు వచ్చి ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మంగాదేవిని పరీక్షించి వైద్యులు 24 గంటలు పర్యవేక్షణలో ఉండాలని తెలిపినట్లు బంధువులు పేర్కొన్నారు. కాగా స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కోతుల బీభత్సం

ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కనే ఉన్న 132కేవీ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం రాత్రి కోతులు బీభత్సం సృష్టించాయి.సబ్‌స్టేషన్ చుట్టూ ఫెన్సింగ్ ఉన్నప్పటికీ కోతుల మూక ట్రాన్స్‌ఫార్మర్లపైకి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఒక కోతి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఇరుక్కుపోయి మృతిచెందింది. దీంతో సుమారు అర్ధగంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో అధికారులు సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని మృతి చెందిన కోతిని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఆ గ్రామానికి ఇద్దరు ఎమ్మెల్యేలు!



మొట్లగూడెం గ్రామాన్ని విడదీస్తున్న రహదారి

- సర్పంచ్ నుంచి ఎంపీ వరకు అదే వరుస
- అయినా కనీస సౌకర్యాల్లేక ప్రజల ఇక్కట్లు
- దశాబ్దాలుగా మారని మొట్లగూడెం దుస్థితి

ఇల్లెందురూరల్: గ్రామం ఒక్కటే.. కానీ ఇక్కడ ప్రజాప్రతినిధులంతా ఇద్దరు చొప్పున ఉంటారు. అయినా ఊళ్లో కనీస సౌకర్యాలు లేవు. దశాబ్దాలుగా అదే దుస్థితిని ఎదుర్కొంటున్న గ్రామం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల సరిహద్దు గ్రామమైన మొట్లగూడెం. ఇక్కడ గ్రామపంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఒకే పార్టీ నుంచి ఇద్దరు చొప్పున ఉంటారు. దీంతో గ్రామస్తులం సగం మంది ఒకరికి, ఇంకో సగం మంది మరొకరికి ఓటు వేయాల్సి వస్తోంది. ఇలా అన్నింట్లో రెండుగా అలవాటుపడిన ఈ గ్రామస్తులను కలిపేది గ్రామం పేరు, గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మాత్రమే.

కాలినడకనే ఓటుకు..

మొట్లగూడెం గ్రామంలో కారేపల్లి మండలం పరిధిలోని భాగం ప్రజలు స్థానికంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఇల్లెందు మండలం పరిధిలోని భాగం ప్రజలు మాత్రం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కేంద్రంలో ఓటు వినియోగించుకోవాల్సి వస్తోంది. ఇందుకోసం వారు కాలినడకన వెళ్లక తప్పడం లేదు.

రోడ్డున్నా.. బస్సు లేదు

కనీస సౌకర్యాలు లేక గ్రామస్తులు దుర్భర జీవనం గడుపుతున్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పంట చేలకు రాఘబోయినగూడెం పెద్ద చెరువు ప్రధాన నీటి వనరుగా ఉంది. కాల్వలు సరిగా లేకపోవడంతో ఏటా చివరి తడి అందక రైతులు పంట నష్టపోతున్నారు. రహదారి మెరుగ్గా ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. వైద్యం, ఉన్నత విద్య కోసం 10 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది. ఓట్ల సమయంలో తప్ప ప్రజాప్రతినిధులు తమను పట్టించుకోరని, ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒక భాగం ఇల్లెందులో.. మరో భాగం కారేపల్లిలో..

ఇల్లెందు మండల కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో, కారేపల్లి మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో మొట్లగూడెం గ్రామం ఉంది. ఇల్లెందు నుంచి చీమలపాడు మీదుగా ఏన్కూరు వెళ్లే ప్రధాన రహదారి ఈ గ్రామాన్ని విడదీస్తూ రెండు గ్రామపంచాయతీలుగా మార్చింది. ఒక భాగం కారేపల్లి మండలం మొట్లగూడెం గ్రామపంచాయతీలో ఉండగా, మరో భాగం ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం గ్రామపంచాయతీలో ఉంది. కారేపల్లి మండలం వైరా అసెంబ్లీ, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉండగా, ఇల్లెందు మండలం ఇల్లెందు అసెంబ్లీ, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉంది.

బస్సు నడపాలి



ఇల్లెందు నుంచి ఏన్కూరు వరకు బీటీ రోడ్డు ఉంది. కానీ మా ఊరికి ఆర్టీసీ బస్సు రాదు. గతంలో కొంతకాలం బస్సు నడిపిన అధికారులు కారణం లేకుండానే నిలిపివేశారు. దీంతో ఆటోలోనే గమ్యం చేరుకోవాల్సి వస్తోంది.

– పొదెం సావిత్రి, మొట్లగూడెం, ఇల్లెందు మండలం

కాల్వలను మెరుగుపర్చాలి



సాగునీటి వనరైన రాఘబోయినగూడెం పెద్ద చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టినా కాలువలను విస్మరించారు. దీంతో అవి ఛిద్రమై చివరి తడికి సాగునీరు అందడం ప్రతిఏటా సమస్యగా ఉంటోంది. కాలువలను మెరుగుపర్చాలి.

– బుగ్గ సురేందర్, మొట్లగూడెం, ఇల్లెందు మండలం.

ఒకే పంచాయతీగా చేస్తే మేలు



గ్రామం రెండు మండలాలు, జిల్లాల పరిధిలో ఉండటం వల్ల పలు సందర్భాలలో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. నివాసం ఒక మండలంలో, భూములు మరొక మండలంలో ఉన్నాయి. గ్రామాన్ని ఒకే పంచాయతీ, ఒకే మండలం, ఒకే జిల్లా పరిధిలోకి తేవాలి.

–పోగుల వీరబాబు, మొట్లగూడెం, కారేపల్లి మండలం

ఎలక్షన్ కమిషన్ @ 1950..

ఖమ్మం సహకారనగర్: కేంద్ర ఎన్నికల కమిషన్‌ను 25 జనవరి 1950లో ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. ఇక ఓటరు గుర్తింపు కార్డులను 1993లో ప్రవేశపెట్టారు. 25 జనవరి 2011న తొలి జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. నాటి నుంచి ఏటా ఇది కొనసాగుతోంది. ఆరోజు కొత్త ఓటర్లతో ర్యాలీలు నిర్వహించి ఓటు విశిష్టతను తెలియచేయడంతోపాటు ఓటరు గుర్తింపు కార్డులు అందజేస్తారు. తెలంగాణ రాష్ట్ర మొదటి ఎన్నికల కమిషనర్‌గా వి.నాగిరెడ్డి సేవలందించారు. సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా 2013వ సంవత్సరంలో నోటాను ప్రవేశపెట్టారు. ఇక అదే ఏడాది ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది.

నగదు సీజ్

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు సోమవారం సీజ్ చేశారు. రెండు వేర్వేరు కార్లలో తరలిస్తున్న రూ. 1,63,500 నగదును మండల పరిధిలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్ టీమ్ హెడ్ కృష్ణ తెలిపారు.

సీపీఎం సీనియర్ నాయకుడు ధర్మా మృతి



గుగులోత్ ధర్మా (ఫైల్)

సుజాతనగర్: మండలంలోని మంగపేటకు చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుగులోత్ ధర్మా(68) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. 1970లో ఎస్ఎఫ్ఐ నాయకుడిగా పనిచేసిన ధర్మా.. ఆ తర్వాత 1980 వరకు డీవైఎఫ్ఐలో పనిచేశారు. 1980లో ఇల్లెందు ఎమ్మెల్యేగా పోటీచేసి కేవలం 250 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1991 నుంచి 95 వరకు కొత్తగూడెం మండలానికి సీపీఎం నాయకుడిగా పనిచేయగా, అనేక ఉద్యమాల్లో ముఖ్యపాత్ర పోషించారు. ఇల్లెందు డివిజన్ కార్యదర్శిగా, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1995లో జూలూరుపాడు జెడ్పీటీసీగా పోటీచేసి గెలుపొందినా కోర్టు స్టే కారణంగా జెడ్పీ చైర్మన్ కాలేకపోయారు. ఇక 1999లో ఖమ్మం ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఐదేళ్ల క్రితం కేన్సర్ బారిన పడినా మంగపేట రైల్వే అండర్ పాస్ వంతెన కోసం కృషి చేసి సాధించారు. చిట్టి రామవరం పోడుభూముల వ్యవహారంలో అనేక పోరాటాలు చేశారు. ధర్మాకు భార్య కౌసల్యతో పాటు కుమార్తె విజయాబాయి, ఐఆర్ఎస్ అధికారి అయిన కుమారుడు రవికిరణ్ ఉన్నారు. ఆయన మృతదేహాన్ని స్వస్థలమైన మంగపేట గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావుతో పాటు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

గుండెపోటుతో బీట్ ఆఫీసర్...



బాలాజీ (ఫైల్)

గుండాల: మండల పరిధిలోని అడవి రామారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంగోత్ బాలాజీ(55) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. అనంతోగు క్రాస్ రోడ్డు చెక్ పోస్ట్ వద్ద ఆదివారం రాత్రి విధులకు హాజరయ్యాడు. అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో తోటి సిబ్బంది ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

తాళ్లగొమ్మూరులో యువకుడు...

బూర్గంపాడు: తాళ్లగొమ్మూరుకు చెందిన అనుముల రాకేష్(26) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో గాయపడిన వ్యక్తి...



ప్రవీణ్ (ఫైల్)

సుజాతనగర్: విద్యుదాఘాతంతో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందాడు. మండలంలోని సింగభూపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల ప్రవీణ్ పిన్ని అయిన కమల జూలూరుపాడులో పండ్ల దుకాణం నిర్వహిస్తోంది. గత మార్చిలో వర్షాలు కురుస్తుండటంతో పండ్లు, కూరగాయలు తడిసిపోకుండా ప్రవీణ్ దుకాణంపై పట్టా కడుతున్నాడు. ఈ క్రమంలో దుకాణంపైన ఉన్న 11 కేవీ వైరుకు ఇతని చేతిలోని బైండింగ్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఈ ఘటనలో 90 శాతం మేర ప్రవీణ్ శరీరం కాలిపోయింది. కొన్ని రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స అందించి, అనంతరం ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమించి ప్రవీణ్ సోమవారం మృతి చెందాడు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

అశ్వారావుపేటరూరల్: అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను సోమవారం అరెస్టు చేశారు. సీఐ టి.కరుణాకర్, ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని మల్లాయిగూడేనికి చెందిన కొమరం వెంకటేష్(32)కు భార్య, సత్యవతి, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 2న కుమార్తె జ్ఞానప్రియను గాండ్రాల గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద దింపేందుకు వెళ్లాడు. ఆ రోజు రాత్రి తిరిగి ఇంటికి రాలేదు. 3న దబ్బతోగు-మల్లాయిగూడెం మార్గంమధ్యలో రక్తపుమడుగులో మృతి చెంది ఉన్నాడు. ఘటనాస్థలంలో రోడ్డు ప్రమాదం జరిగి మృతి చెందినట్లు ఉంది. కాగా మృతుడి తల్లి నాగమ్మ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దారికాచి..

అశ్వారావుపేట మండలం గోపన్నగూడేనికి చెందిన గొంది లక్ష్మణరావుతో వెంకటేష్ భార్య సత్యవతితో కొంతకాలంగా వివాహేతర సంబంధం నెరుపుతోంది. తమకు అడ్డు వస్తున్నాడనే కారణంతో వెంకటేష్ హత్యకు సత్యవతి, లక్ష్మణరావు పథకం పన్నారు. ఈ క్రమంలోనే గాండ్రాల వెళ్లిన వెంకటేస్ రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వస్తుండగా దబ్బతోగు-మల్లాయిగూడెం మార్గంమధ్యలో దారికాచారు. ద్విచక్రవాహనంపై వస్తున్న వెంకటేశ్‌ను అడ్డగించి, రోడ్డు పక్కకు లాక్కెళ్లారు. చెట్ల పొదల్లో ముందే సిద్ధంగా ఉంచుకున్న కొడవలి, రాయితో దాడికి పాల్పడి హతమార్చారు. ఆ తర్వాత వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు సత్యవతి, లక్ష్మణరావులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ప్రియాంక మృతదేహం

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ప్రియాంక (33), పీవీ కాలనీకి చెందిన ఉదయ్ 2014లో ప్రేమ వివాహం చేసుకున్నారు. మణుగూరులో సింగరేణిలో క్లర్క్‌గా పనిచేసే ఉదయ్ ఇటీవల బదిలీపై మందమర్రికి వెళ్లాడు. అప్పటి నుంచి భార్య అతని అమ్మమ్మతో కలిసి క్వార్టర్‌లోనే నివాసం ఉంటోంది. కాగా అదనపు కట్నం కావాలని భర్త వేధిస్తుండటంతోపాటు కుటుంబ సభ్యులను కలవొద్దంటూ ఆంక్షలు పెడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన ప్రియాంక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు..

కొత్తగూడెంరూరల్: అప్పుల బాధ భరించలేక ఓ యువకుడు లక్ష్మీదేవిపల్లి ముర్రేడు వాగు బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సంతోష్ కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలో కూలీ లైన్‌కు చెందిన ఎండీ మస్తాన్ కుమారుడు నజీమ్ (36) ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడిపిస్తున్నాడు. ఇటీవల కాలంలో అప్పులపాలు కావడంతో లక్ష్మీదేవిపల్లిలోని ముర్రేడు బ్రిడ్జిపై నుంచి దూకాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం కాలనీ గ్రామంలో సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కాలనీలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి ఓ వ్యక్తి చనిపోయి ఉండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన సప్కా ఏసు(40)గా స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాలికపై అత్యాచారయత్నం

సుజాతనగర్: మైనర్ బాలికపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 4న మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక జామకాయలు కోసేందుకు తన గ్రామంలోని మరో ఇంటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన అదే గ్రామానికి చెందిన వీరప్రసాద్ ఆమె నోరు మూసి, తన ఇంటికి ఎత్తుకెళ్లి అత్యాచారం చేయబోయాడు. ఈ క్రమంలో అతని నుంచి విడిపించుకుని వచ్చిన బాలిక ఈ విషయాన్ని తల్లికి తెలిపింది. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.సోమేశ్వర్ తెలిపారు.

హోంగార్డుకు ఐదేళ్ల జైలు శిక్ష

భార్య ఆత్మహత్య కేసులో కోర్టు తీర్పు

కొత్తగూడెంటౌన్: భార్య ఆత్మహత్య కేసులో ఓ హోంగార్డుకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 4 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జి.భానుమతి సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ మండలం జగన్నాథపురానికి చెందిన భూక్య ప్రమీలతో, అదే గ్రామానికి చెందిన హోంగార్డు దారావత్ చంద్రుకు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. మద్యానికి బానిసైన చంద్రు విధులకు సక్రమంగా వెళ్లేవాడుకాదు. భార్య కూలి పనులకు వెళ్లి తెచ్చిన డబ్బులతో కూడా మద్యం తాగేవాడు. భార్య, పిల్లలను కొడుతూ నిత్యం కొడుతూ వేధించేవాడు. దీంతో వేధింపులు తాళలేక ప్రమీల 16.12.2015 పుట్టింటికి వచ్చేసింది. మరుసటి రోజు వచ్చిన చంద్రు భార్యను, పిల్లలను కొట్టడంతోపాటు బూతులు తిట్టాడు. దీంతో అవమానం భరించలేక ప్రమీల ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాల్లి భూక్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, న్యాయమూర్తి 10 మంది సాక్షులను విచారించారు. దారావత్ చంద్రుపై నేరం రుజువుకావడంతో ఐపీసీ సెక్షన్ 306 ప్రకారం ఐదేళ్ల సాధారణ జైలుశిక్షతో పాటు రూ.3 వేల జరిమానా, 498(ఏ) ప్రకారం ఏడాది జైలుశిక్షతోపాటు రూ. 1,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు శిక్షలను ఏక కాలంతో అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మీరజ్ ఫిర్దొసి కేసు వాదించారు.

ఆయన రెండుసార్లు.. ఆమె ఒకసారి

మధిరలో ఎమ్మెల్యేగా గెలిచిన దంపతులు



దుగ్గినేని వెంకయ్య



దుగ్గినేని వెంకట్రావమ్మ

మధిర: ఖమ్మం జిల్లాలో మధిర అసెంబ్లీ స్థానానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి నుంచి భార్యాభర్తలు ఎమ్మెల్యేలుగా గెలుపొందడమే ఆ ప్రత్యేకత. భర్త రెండుసార్లు, భార్య ఓసారి విజయం సాధించారు. వీరిద్దరూ ఒకే ప్రత్యర్థిపై గెలుపొందడం విశేషం. 1962, 1967లో జరిగిన ఎన్నికల్లో మధిర మండలం ఇల్లూరుకు చెందిన దుగ్గినేని వెంకయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 1962లో ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్.శంకరయ్యపై 5,456 ఓట్ల తేడాతో, 1967లో సీపీఎం అభ్యర్థి బోడేపూడి వెంకటేశ్వరరావుపై 10,404 ఓట్ల మెజారిటీతో ఆయన గెలిచారు. వెంకయ్య మృతి అనంతరం 1972 జరిగిన ఎన్నికల్లో ఆయన సతీమణి దుగ్గినేని వెంకట్రావమ్మకు కాంగ్రెస్ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. దీంతో ఆమె సీపీఎం అభ్యర్థి బోడేపూడి వెంకటేశ్వరరావుపై 17,349 ఓట్ల తేడాతో గెలుపొందారు. మధిర నియోజకవర్గ చరిత్రలో తొలి మహిళా ఎమ్మెల్యేగా వెంకట్రావమ్మ చరిత్ర సృష్టించగా.. ఆ తర్వాత మళ్లీ మహిళకు ప్రధాన పార్టీల నుంచి టికెట్లు దక్కలేదు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున సుగ్గర్తి విజయవాణి పోటీ చేసినప్పటికీ డిపాజిట్ కోల్పోయారు.

వీఆర్‌పురం నుంచి నలుగురు శాసనసభ్యులు

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఎన్నికైన ఎమ్మెల్యేల్లో నియోజకవర్గ మండల కేంద్రానికి చెందిన వారెవరూ లేరు. అలాగే, 1978 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేలుగా గెలిచిన నలుగురి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన వరరామచంద్రాపురం(వీఆర్‌పురం) మండలం కావడం విశేషం. 1978, 1983 ఎన్నికల్లో గెలిచిన ముర్ల ఎర్రయ్యరెడ్డి స్వగ్రామం వీఆర్‌పురం మండలం జీడిగుప్ప గ్రామం. ఇక 1985, 1989, 1994లో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే కుంజా బొజ్జిది అదే మండలంలోని అడవి వెంకన్నగూడెం. ఆ తర్వాత 2004, 2014లో గెలిచిన సున్నం రాజయ్య వీఆర్‌పురం మండలంలోని సున్నంవారిగూడెం వాసి. 2009లో గెలిచిన కుంజా సత్యవతి స్వస్థలం వీఆర్‌పురం మండలంలోని వడ్డిగూడెం. కాగా 2018 ఎన్నికల్లో గెలిచిన పొదెం వీరయ్యది ములుగు జిల్లాలోని మంగపేట మండలం తొండ్యాల లక్ష్మీపురం గ్రామం.

ఈసారి ఎవరో..?

ప్రస్తుత ఎన్నికల్లో నాన్ లోకల్ సెంటిమెంట్ కొనసాగుతుందా, లేదా అనే చర్చ స్థానికంగా కొనసాగుతోంది. ములుగు జిల్లాకు చెందిన పొదెం వీరయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి పోటీకి దిగారు. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావు స్వస్థలం దుమ్ముగూడెం మండలం అయినా వైద్య వృత్తిరీత్యా భద్రాచలంలో 20ఏళ్ల క్రితం స్థిరపడ్డారు. వీరితో పాటు బీజేపీ, ఇతర పార్టీలే కాక స్వతంత్రులు బరిలోకి దిగుతున్నారు. దీంతో నాన్ లోకల్ సెంటిమెంట్ కొనసాగుతుందా.. బ్రేక్ చేస్తారా అనే ఆసక్తి నెలకొంది.

వామపక్ష అభ్యర్థులను గెలిపించాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్



పార్టీ అభ్యర్థి అర్జున్‌ను పరిచయం చేస్తున్న వెంకట్

అశ్వారావుపేటరూరల్: ప్రజాధనం ప్రైవేటు, కార్పొరేట్ శక్తుల పరంకాకుండా ఉండేందుకు ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బి.వెంకట్ కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతోన్మాద, బూర్జువా పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ఓడించాలన్నారు. సీపీఎం ఒంటరి పోటీకి ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీనే బాధ్యత వహించాలన్నారు. సీపీఐ పోటీ చేసే స్థానంలో సహకారం అందిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సీపీఎం ఏడు స్థానాల్లో పోటీ చేస్తోందని, ఈ నెల 8న భద్రాచలంలో, 9న అశ్వారావుపేట, పాలేరు, ఖమ్మం, సత్తుపల్లిలో పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేస్తారని పేర్కొన్నారు. అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పిట్టల అర్జున్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఎం అభ్యర్థి పిట్టల అర్జున్, పార్టీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య, సీహెచ్.సీతారామయ్య, బి.చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా

న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజిమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజిద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజిమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.





స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజిమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజిమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజిమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజిమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజిద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజిమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు

శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.



వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావోపాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్జియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

ఫైనల్లో స్వియాటెక్



కాన్‌కున్ (మెక్సికో): మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) ఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన రెండో సెమీఫైనల్లో స్వియాటెక్ 6-3, 6-2తో ప్రపంచ నంబర్‌వన్, గత ఏడాది రన్నరప్ సబలెంకా (బెలారస్)పై గెలిచింది. ఐదో ర్యాంకర్ జెస్సికా పెగూలా (అమెరికా)తో జరిగే ఫైనల్లో స్వియాటెక్ గెలిచి విజేతగా నిలిస్తే మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటుంది.

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా


● రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

"కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు" అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. "ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


● అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.


● కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

\- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.


● ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – "'జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా" అన్నారు.

నటుడు– దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– "దర్శకత్వం–నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది" అని చెప్పుకొచ్చారు.


● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

\- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– "పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి" అన్నారు. "ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను" అన్నారు అనిల్ రావిపూడి. "తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊళ్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు" అన్నారు 'బన్నీ' వాసు. "నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్" అన్నారు తేజా మార్ని. "ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు" అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.


● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

\- నిర్మాత గౌరీకృష్ణ

"నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– "'మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి" అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం


● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– "అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

\- దర్శకుడు మారేష్ శివన్



"ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది" అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–"ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశావని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు" అన్నారు.